ఓంశ్రీసాయిరాం

ప్రేమస్వరూపులారా! ఈనాడు ప్రత్యేకంగా నేను చెప్పునది ఏమియూ లేదు. చెప్పవలసినవి అన్నీకూడను గోల్డ్‌స్టీన్, శ్రీనివాసన్ మీకు తెలిపారు. ఈనాటి ఎడ్యుకేషన్ కేవలం భౌతికమైనది, బాహ్యమైనది, ప్రాపంచికమైనది. ఇట్టి చదువులు చదివినవారు భారతదేశంలో కోటానుకోట్లు కలరు. కాని, వారివల్ల ఈనాడు సమాజమునకు జరిగే ఉపకారముగాని, సహాయముగాని ఏమీ లేదు. ఎవరి స్వార్థ, స్వప్రయోజనములను వారు చూచుకుంతున్నారేగాని ప్రజలయొక్క సుఖమును, ఆనందమును కోరువారు ఎవ్వరూ కానరావటం లేదు. ఈనాడు సమాజం ఏ పరిస్థితిలో ఉన్నది? ప్రజలు ఎట్టి బాధలు అనుభవిస్తున్నారనే విషయం ఎవ్వరికీ అర్థం కావటంలేదు. ఏదో పబ్లిక్‌లో మాట్లాడేటప్పుడు మాత్రం, 'బీదలకు సహాయం చేయాలి' అని చెబుతున్నారేగాని, చేసేవారు ఎవ్వరూ కనిపించటం లేదు. అసలు ఎవరు బీదలు? ఎవరు ధనవంతులు? చెప్పినది చేసి చూపించినవారే ధనవంతులు. చెప్పినది చేయనటువంటివారందరూ బీదవారే. 'మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం' అటువంటి మహాత్ములు ఈనాడు నూటికో కోటికో ఒకరున్నారు.

ఈనాడు ప్రపంచము ఎలాంటి పరిస్థితిలో ఉన్నదో మీకు తెలుసు. ఎక్కడ చూచినా కష్టములు, దుఃఖములే తప్ప ఆనందమనేది కనిపించటం లేదు. ప్రతి ప్రాంథమువారు, ప్రతి దేశమువారు తాము సాధించిన అభివృద్ధిని గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు. ఆ గొప్పతనం కేవలం వారు చెప్పుకున్నదేగాని, నిజంగా గొప్పతనం ఎక్కడా కనిపించటం లేదు. ఎవరి కష్టములు వారు అనుభవిస్తూనే ఉన్నారు. బీదలపరిస్థితిని ఎవరూ అర్థంచేసుకోవటం లేదు. గొప్పగొప్ప దేశములనిపించుకున్నవికూడా ఇతర దేశాలకు ఎన్నివిధములైన అపకారములో చేస్తున్నాయి. దానికి వారు పశ్చాత్తాపముకూడను పడటం లేదు. ఆ బీదలు ఎంత కష్టపడుతున్నారో, ఎంత బాధపడుతున్నారో వారికి ఏమాత్రం కనిపించటం లేదు. అన్ని దేశములందు బీదలు, ధనికులు ఉన్నారు. అయితే, ధనికులకు మాత్రమే సహాయం లభిస్తున్నదిగాని బీదలకు ఎట్టి సహాయము లభించటం లేదు. మనం మొట్టమొదట బీదలను కాపాడాలి. ప్రతి భక్తునికీ ప్రేమ, దయ రెండూ ఉంటుండాలి. త్యాగగుణము కలవానికే దివ్యమైన ఆనందము కలుగుతుంది. 'నేను, నాది' అనే సంకుచితమైన భావంతో జీవించేవానికి ఎప్పటికీ దైవసహాయం లభించదు.

'నేను' అనే సంకుచుతమైన భావం ఉన్నచోట అహంకారం వచ్చి చేరుతుంది. 'నాది, నావారు' అని భఆవించేవారి దగ్గర అభిమానం వచ్చి చేరుతుంది. అభిమానం తోడైనప్పుడు మనిషికి అహంకారము మరింత ఎక్కువ అవుతుంది. విశాలమైన ఈ ప్రపంచములో 'నేను, నాది' అని ఎవరు అహంకార పడుతుంటారో వారికి కష్టములు తప్పవు. దీనికంతటికీ కారణం ఏమిటి? ఈనాడు అందరూ కేవలం భౌతిక విద్యలను అభ్యసిస్తున్నారు. భౌతిక విద్య ప్రభావంచేత మానవుడు కేవలం తన స్వార్థం గురించి తప్ప ఇతరుల సౌఖ్యం గురించి ఆలోచించటం లేదు. మనం అందరినీ ప్రేమించాలి. ఈనాడు ప్రపంచములో గొప్పగొప్ప వారికందరికీ పాపభీతి, దైవప్రీతి రెండూ లేకుండాపోయినాయి. దినదినమునకూ స్వార్థస్వప్రయోజనములు పెరిగిపోతూ హృదయ విశాలత తగ్గిపోతున్నది. స్వార్థమును త్యజించాలి. ఎంతవరకు వీలైతే అంతవరకు మన శక్తిని బీదలకొరకు పయోగించాలి. బీదలే గనుక కష్టపడి పనిచేయకపోతే ఎవరికీ ఏవిధమైన ఆహారమూ లభించదు కదా!

భూమిని దున్ని విత్తులు నాటి పంటలు పండిస్తే
వీరు మేడలనుండి మెట్లే దిగక మ్రింగి కూర్చుంటే
అన్నము వీరిది, అంబలిగంజి వారిది!
దేవుడిచ్చిన ధరణిరా ఇది ఎవడి అబ్బ సొమ్ము?
వారికి లేని హక్కులు వీరికెట్లు కలిగె?
బలవంతులమని పైబడవస్తే భగవంతుడే లేడా?

కనుక, మనం బీదలను ఆదరించాలి. వారితో సేవలు చేయించుకొంటున్నందుకు వారికికూడా మనం సేవలు చేయాలి. ఈనాడు పెద్దపెద్ద చదువులు చదివిన వారంధరూ నూటికి నూరు శాతం స్వార్థంలో మునిగి ఉన్నారు. చదువుకున్నవారియందే చిల్లర బుద్ధులు బయలుదేరుతున్నాయి. అందరూ తమ స్వార్థం కోసమని పరాయివారిపై పడుతున్నారేగాని, పవిత్రమైన భావంతో సహాయంచేయాలనే సద్బుద్ధితో ఎవ్వరూ ప్రవర్తించటం లేదు.

మానవునికి ఉండవలసినది ఏమిటి? సత్యము, ధర్మము, న్యాయము, శాంతి, ప్రేమ, అహింస. ఈ మానవతా విలువలు లేనివాడు మానవుడని ఏరీతిగా చెప్పుకోగలడు? మానవతా విలువలు లేకుండా, రాక్షసగుణములు పెట్టుకొన్నవాడు మానవుడెట్లవుతాడు? తన ప్రక్కనున్న వ్యక్తి బాధపడుతుంటే పట్టించుకోకుండా ఆనందముగా ఉండటానికి మానవునికి ఏమాత్రమూ అధికారము లేదు. ఈ జగత్తులో అందరూ భగవంథుని బిడ్డలే. ఆ బిడ్డలలో ఎవరికి బాధ కలిగినా ఆ బాధ మనదిగా భావించాలి. 'వారు బాధపడితే నాకెందుకు' అని అనుకోకూడదు. ఈవిధమైన ప్రేమతో, భక్తితో మనము ఈ జగత్తులో జీవించాలి. ఈవిధమైన సమానత్వమును మనం పోషించుకోవాలి. అందరూ ఏకం కావాలి. యూనిటీ ఉన్నప్పుడే హృదయంలో ప్యూరిటీ వస్తుంది. ప్యూరిటీ

ఏర్పడినప్పుడే డివినిటీ మన దగ్గరకు వస్తుంది. కనుక, యూనిటీ, ప్యూరిటీ, డివినిటీ ఈ మూడింటినీ దృష్టిలో పెట్టుకొని మనం జీవితాన్ని గడపాలి.

'ఈశ్వరస్సర్వ భూతానామ్' అందరి హృదయంలో ఉన్నది ఒకే భగవంతుడు. చీమలయందు, దోమలయందు కూడను భగవంతుడున్నాడు. వాటినికూడను మనం రక్షించాలి. ఫ్లిట్ కొట్టి దోమలను చంపకూడదు. వాటివలన నీకు బాధ లేకుండా చేసుకోవాలంటే ఒక దోమతెర కట్టుకో. ఈవిదంగా దయ కలిగిన హృదయము ధర్మ మార్గంలో ప్రవేశిస్తుంది. కంపేషన్ అనేది ఇప్పుడు ఎక్కడా కనిపించటం లేదు. ఎక్కడ చూచినా కమ్-ఫ్యాషన్. ఇంక సమత్వం ఎట్లా ఏర్పడుతుంది? మనలో కించిత్తైనా మానవత్వమనేది చూపించాలి. మానవతా గుణములు ఉన్నప్పుడే మానవుడు దయాహృదయుడౌతాడు. కామము, క్రోధము, ద్వేషము, అసూయ, డంబము ఇవన్నీ మృగలక్షణాలు. ప్రేమ, దయ, ధర్మము, త్యాగము, సత్యము ఇవే మానవునియొక్క నిజమైన సంపద. ఈనాడు ఆకారం చూస్తే మానవీకారం, లోపల చూస్తే పశుగుణాలు. మనం మానవాకారాన్ని చూస్తున్నాముగాని దానియొక్క విశిష్టతను ఏమాత్రం విచారించటం లేదు. రూపం కాదు ప్రధానం. మానవతా గుణములు కావాలి. మనం ఏ దేశము వారినైనా బాధపెడితే, ఇంకొక దేశం మనలను బాధిస్తుంధి. అధి తప్పింధి కాదు. ప్రతి కర్మకు రియాక్షన్, రిఫ్లక్షన్, రీసౌండ్ ఈ మూడూ ఉండే తీరుతాయి. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించినప్పుడే మీరు మానవతా గుణములను పోషించుకోగలరు. మా విద్యాసంస్థలలో చిన్నచిన్న పిల్లలీకూడా మానవతా గుణములంటే ఏమిటో సుస్పష్టంగా చెబుతారు. వారిని చూచి పెద్దవారుకూడను నేర్చుకోవలసి వస్తుంది. ముఖ్యంగా మనం చిన్న పిల్లలలో మానవతా విలువలను పెంచుకుంటూ రావాలి. బాబాలికలు మానవతా విలువలను అనుసరిస్తూ పెద్దవారు కావాలి.

మానవతా విలవలలో మొట్టమొదటిది సత్యము. ఇది ఎక్కడనుండి వస్తుంది? భూమినుండి రాదు. ఆకాశమునుండి ఉట్టిపడదు. నాలుగు దిక్కులనుండి రాదు. మన హృాదయమునందే ఉన్నది సత్యము. నీవు చక్కగా లోదృష్టితో విచారించి చూచినప్పుడు నీకు తప్పక సత్యము తెలుస్తుంది. సత్యము ఎప్పుడు వస్తుందో అప్పుడే ధర్మము ఏర్పడుతుంది. సత్యము, ధర్మము రెండూ చేరినప్పుడు శాంతి వస్తుంది. శాంతినుండి ప్రేమ ఆవిర్భవిస్తుంది. శాంథి, ప్రేమ రెండూ చేరినప్పుడు అహింస పుడుతుంది. కనుక, ఇవన్నీ మనలోనే ఉంటున్నాయి. అన్నీ మనమే చక్కచేసుకోవాలి. పుస్తకాలను చదివో, లేక పెద్దలను అడిగో మనం తెలుసుకోనక్కర లేదు. అన్నీ మనయందే వీంటున్నవి. మానవుడే దేవుడు. కనుకనే, భగవంతుని మానవాకారంలోనే చిత్రిస్తున్నారు.

మీరు ఎవరైనా భగవంతుని అడగంఢి, 'నీవెవరు?' అని. 'అహం బ్రహ్మాస్మి' అని చెబుతాడు. అంతేగాని, 'నేను ఫలానా' అని ఏదో ఒక పేరు చెప్పడు. పేరు తల్లిదండ్రులు పెట్టినదేగాని, భగవంతుడు ఇచ్చినది కాదు. భగవంతుడు ఇచ్చినది ఒక్కటే. అదే ఆత్మ. అందుకోసమే 'మమాత్మా సర్వభూతాంతరాత్మా' అన్నాడు కృష్ణపరమాత్మ.

ఆత్మ అందరియందూ ఉన్నది. క్రిమికీటకాదులయందుకూడా ఉన్నది. చీమలు లైనుగా పోతుంటాయి. తమకు ఎదురుగా వచ్చిన చీమలను ప్రేమతో పలుకరించి, ముద్దుపెట్టుకొని ఆనందంగా ముందుకు పోతుంటాయి. పశువులయందుకూడను ఈవిధమైన సంబంధబాందవ్యాలు ఉంటున్నాయి. ఆవుకు దూడ పుట్టిందంటే, బిడ్డను విడిచి తల్లి ముందుకు వోళ్ళదు. తల్లి కనిపించకపోతే బిడ్డ,' అమ్మా, అమ్మా' అని ఏడుస్తుంది. తల్లి, 'బిడ్డా, బిడ్డా' అంటూ దగ్గరకు వస్తుంది. పక్షులయందుకూడను ఇట్టి ప్రేమ ఉన్నది. ఒక చెట్టుపైన రెంధు పక్షులు కూడి ఉన్నప్పుడు ఒక బోయివాడు బాణంతో మగపక్షిని చంపాడు. ఆడపక్షి ఏడ్చి ఏడ్చి తానుకూడా ప్రాణం విడిచింది. ఈ దృశ్యాన్ని చూచిన వాల్మీకి నోటినుండి అప్రయత్నంగా ఒక శ్లోకం వెలువడింది. ఆ ఘట్టమే రామాయణ మహాకావ్య రచనకు నాంది అయింది.

పశుపక్ష్యాదులుకూడను ఇటువంటి ప్రేమను, సన్నిహితసంబంధబాంధవ్యాలను కలిగి ఉండగా, మానవునియందు ఇవి ఎందుకు లోపిస్తున్నాయి? పశువులు, పక్షులుకూడను మానవునికి ఎన్నియో బుద్ధులు నేర్పుతున్నాయి. కాని, ఎన్నివిధాలుగా నేర్పినప్పటికీ మానవుడు మాత్రం కళ్ళు తెరవటం లేదు. అదేవిధంగా, స్వామి మీకు ఎన్ని చెప్పినప్పటికీ మీ మెదడుకు ఎక్కటం లేదు. చెప్పినట్లుగా మీరు నడచుకొన్నప్పుడే ఇవన్నీ మీకు బోధపడతాయి.

నిన్ను ఎవరైనా తిట్టినప్పుడు నీవు బాధపడతావుకదా! అట్లే, నీవు ఇతరులను తిట్టినప్పుడు వారుకూడా బాధపడతారని నీకు తెలియదా! అయితే, ఎవరు తిట్టినా, కొట్టినా, ఏమి చేసినా అంతా భగవంతునియొక్క లీలయే అని మనం భావించుకోవాలి. ఈవిధమైన దైవభావమును పెట్టుకొన్నప్పుడు ఎంతైనా మనం బాగుపడతాం. ఈనాడు ధనమంటే ధనవంతులుకూడను ఎంతగానో ఆశపడుతున్నారు. కాని, దైవమంటే ఆసించటం లేదు. ఆత్మవిశ్వాసం పూర్తిగా సన్నగిల్లింది. ఎక్కడుంది ఆత్మ? ఆత్మ అంటే ఏమిటని అనేక ప్రశ్నలు వేస్తారు. కాని, ఆత్మ వారిలోనే ఉన్నదనే తత్త్వము వారికి ఏమాత్రం అర్ధంకాదు.

'ఇది నా కర్చీఫ్' అనుకుంటున్నాను. కనుక, నేను వేరు, కర్చీఫ్ వేరు. అదేవిధముగా, 'ఇది నా దేహము' అనుకున్నప్పుడు దేహము వేరు, నీవు వేరు. 'ఇది నాది, నాది' అంటున్నావు. మరి నీవు ఎవరు? నీ విషయం నీవు తెలుసుకోవటం లేదు. నిన్ను నీవు తెలుసుకొంటే అన్నీ తెలుసుకొన్నవడౌతావు. నిన్ను నీవు తెలుసుకోలేనప్పుడు ఇంకేమి తెలుసుకున్నా ప్రయోజనం లేదు. కనుక,

మొట్టమొదట నీవు శాంతంగా, సంతోషంగా కూర్చొని 'నీవెవరు?' అని యోచనచేయి. అదే నిజమైన ధ్యానము. మెడిటేషన్ అనగా దైవాన్ని చింతించటం కాదు. నిన్ను నీవు తెలుసుకోవాలి. god is in you, with you, above you, below you, around you. you are god. కనుక, ఎవరైనా, 'నీవెవరు?' అని అడిగినప్పుడు,' నేను దైవాన్ని' అని చెప్పండి. అంతేగాని, 'నేను ఫలానా' అని మీ పేరు, ఊరు చెప్పుకోకూడదు. 'నేను దైవాన్ని' అనుకున్నప్పుడు నీకెంత ఆనందము కలుగుతుంది! అది విన్నవారికికూడా ఎంత ఆనందము కలుగుతుంది! కనుక, మనం భగవంతునితో ఏకత్వాన్ని అనుభవించాలి.

విద్య అనగా గ్రంథములు బోధించే లౌకిక జ్ఞానము కాదు. గ్రంథములను చదవటంద్వారా వాటిలోనున్న పదములయొక్క అర్థములు మాత్రమే మనకు తెలుస్తాయిగాని, మన నిజతత్త్వం గోచరం కాదు. 'నేనెవరు? నేనెవరు?' అని మొట్టమొదట ప్రశ్న వేసుకోవాలి. అప్పుడే మనకు సరియైన జవాబు వస్తుంది. నీవు దేహమా? మనసా? బుద్ధియా? చిత్తమా? అహంకారమా? ఇవన్నీ నీవు కాదు. 'ఇది నా దేహం' అంటున్నారు. కాబట్టి దేహం నీవుకాదు. 'నా మనస్సు' అంటున్నావు. కనుక, మనస్సు నీవు కాదు. దేహము, మనస్సు ఇవన్నీ భగవంతునియొక్క ప్రసాదములే. కాబట్టి, వాటిని కూడా మనం గౌరవించాలి.

మనం గ్రంథాల్లో వ్రాసినవన్నీ చదివి ఆచరణలో పెట్టాలి. నిన్న ఒక పిల్లవాడు వచ్చి, 'స్వామీ! నేను షిరిడీ సచ్చరిత పూర్తిగా చదివాను' అన్నాడు. 'ఔహో! సచ్చరిత పూర్తిగా చదివినావా?' అని అడిగితే, 'ఒక్క అక్షరం కూడా వదలకుండా చదివాను స్వామీ!' అన్నాడు. 'నావు ఎన్ని ఆచరణలో పెడుతున్నావు?' అని అడిగితే, 'ఏ ఒక్కటీ ఆచరణలో పెట్టలేదు' అన్నాడు. ఇంక చదివింది ఎందుకు? కోవలం కాగితాలు త్రిప్పివేయటంకోసమా? కాదు. నీ హృదయాన్ని త్రిప్పివేయాలి. నీ హృదయంలో సత్పరిమాణం కలగాలి. అప్పుడే నీవు చేసిన పారాయణం సార్థకమౌతుంది. మనం అనేకరకములైన సాధనలు చేస్తున్నాముగాని, ఇవన్నీ మన భ్రమతో కూడినవేగాని నిజమైన సాధనలు కావు. రియాలిటీని చూడాలంటే నీ దృష్టిని అంథర్ముఖం గావించుకోవాలి. నీవు కన్నులు తెరిచి బయటి ప్రపంచాన్ని చూచినప్పుడు ఇన్ని తలలు కనబడుతుంటాయి. కన్నులు మూసుకొని నీ లోపల నీవు చూచుకో. నీవు తప్ప నీకు మరొకరెవ్వరూ కనిపించరు. మొట్టమొదట నిన్ను నీవు చూచుకో. 'నేనెవరు?' అనేదానికి 'నేను నేనే' అదే సరైన జవాబు. 'నేను రామయ్యము, 'నేను అమెరికన్' ఇవి సరైన జవాబులు కావు. అవన్నీ బాహ్యమైన, లౌకికమైన పేర్లు. అవి ముఖ్యం కావు. నీ హృదయాన్ని నీవు పరిశీలన చేసుకో. పరీక్ష చేసుకో. అదే నీకు ముఖ్యం. అప్పుడే నీకు సత్యం గోచరిస్తుంది. ముఖ్యంగా ఈనాడు చదువు విషయమై గోల్డ్‌స్టీన్, శ్రీనివాస్ ఎంతో గొప్పగా చెప్పారు. ప్రపంచమునకు సంబంధించినటువంటిది ఎడ్యుకేషన్ అన్నారు. కాని ఎడ్యుకేర్ అనేది ప్రపంచమునకు సంబంధించినది కాదు. దానివలనే 'నేను నేనే' అనే సత్యాన్ని గ్రహించటానికి వీలవుతుంది. 'ఐ యామ్ సో అండ్ సో' అని చెప్పుకొనకూడదు. 'ఐ యామ్ ఐ' అని చెప్పగలగాలి.

నిత్యజీవితంలో మీకు కలిగే సందేహాలకు రేపటి దినము నేను తగినటుంటి సమాధానములిస్తాను. వాటిని మీరు గుర్తించి వర్తించండి. తప్పక మీకు దైవత్వం సాక్షాత్కరిస్తుంధి. అతిత్వరలోనే మీరు దైవత్వాన్ని అనుభవిస్తారు. ఈనాటి చదువులు నేను చెప్పటం లేదు. అది అంధరికీ తెలినదే. అక్షరాలు చదవటం, వాటి అర్థం తెలుసకోవటం గొప్పతనము కాదు. అది కేవలం బుకిష్ నాలెడ్జి. నీవు హృదయ సంబంధమైన నాలెడ్జిని సంపాదించుకో. అదే నిజమైన నాలెడ్జి. అదే సత్యము. అది ఎప్పటికీ మారదు. సత్యము అనేది ఒక్కటేగాని రెండు కాదు. కనుక, సత్యమే దైవత్వము. ధర్మమే దైవత్వము. శాంతియే దైవత్వము. ప్రేమయే దైవత్వము. అది మీరు తప్పక తెలుసుకోవాలి. love is god. live in love. ఆ దైవప్రేమను మీరు పెట్టుకొంటే ఎంతైనా సాధించ గలరు. ఇది నా ప్రేమ. 'వారిని మాత్రమే ప్రేమిస్తున్నాను' అని అనుకోవటం అహంకారము. అది నీ ప్రేమ కాదు. దైవప్రేమనే! 'god is one, goal is one'. ఈ సత్యాన్ని దృఢంగా నమ్ముకుంటే మనకు అన్నీ అర్థమవుతాయి. మనం ఈ ప్రపంచములో అనుభవించే ఆనందము నిజమైనది కాదు. నిజమైన ఆనందము మనలోనే ఉన్నది. మానవతా విలువలు మనలోనే ఉన్నాయిగాని బయట లేవు. 'ఎడ్యుకేర్' అనగా ఏమిటి? మన లోపల ఉన్నటువంటి విలువలను బయటికి తీయటమే. మనం చదివేటువంటి పుస్తకములన్నీ 'ఎడ్యుకేషన్'కు సంబంధిచినవి. ఇప్పుడు మనకు ఎడ్యుకేర్ కావాలి. ఎడ్యుకేర్ వచ్చిందంటే అందరూ ఏకమైపోతారు. ఈనాడు మానవత్వంలో అనేకరకములైన భేదాలు ఏర్పడుతున్నాయి. అది పోయి ఏకత్వం రావాలి. ఈనాడు మీకు తెలుపుతున్నాను, ఇంక ఇరవై అయిదు, ముప్ఫై సంవత్సరాలలో ప్రపంచమంతా ఒకటిగా అవుతుంది. ఒకే కులం, ఒకే మతం, ఒకే దైవం- అలాంటి ఏకత్వం రావాలి. దీనినే వేదము 'ఏకం సత్ విప్రాః బుహుధా వదన్తి' అన్నది.

(ప్రపంచ విద్యా సమ్మేళన ప్రారంభోత్సవ సమావేశములో భగవాన్ బాబా దివ్యసందేశము)